andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.9 | కనిష్ఠం 16.5





ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో అగ్నిమాపక శకటం ప్రదర్శన



పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

అందరి సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

నిర్మల్ కైన్‌గేట్/నిర్మల్ అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొదట కలెక్టరేట్‌లో ఆమె జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో ఆమె పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ఆమె ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా కార్యక్రమాలకు పేదలకు వరం కాబోతున్నాయని అన్నారు. జిల్లాలో ఈ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో 27,417 మంది భూమి లేని నిరుపేదలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గుర్తించినట్లు తెలిపారు. 72,500 మంది రైతు కుటుంబాలకు రైతు భరోసా, ఇళ్లు లేని పేదలందరికీ మొదటి విడతలో 3,500 ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 1,23,556 మంది కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలో 2,08,426 తెల్లరేషన్ కార్డులున్నాయని తెలిపారు. నిరుపేద పిల్లల కోసం జిల్లాలో బాలశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి కూడా అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు రూ.470 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేసి పేదవర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లు లేని నిరుపేదలందరికీ రూ.5లక్షల పూర్తి సబ్సిడీతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వం కొలువు దీరిన 48గంటల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించేందుకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో వివిధ వ్యాధులకు సంబంధించి చికిత్స అందించడానికి ఇప్పటి వరకు రూ.26.35 కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందించడం జరుగుతుందన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరుకు ప్రజా పాలన, వార్డు సభలల్లో గుర్తించిన అర్హులైన లబ్ధిదారులకు అందించనున్నామన్నారు. 2024-2025 వానాకాలానికి గానూ 29,838 మంది రైతుల నుంచి 1,14,185 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యంను కొనుగోలు చేసి రూ.265 కోట్లను రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి రూ. 16.67 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా జిల్లాకు రూ.189.17 లక్షల ఎఫ్ఎఫ్‌సీ నిధులు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు రూ.94.30 లక్షలు ఖర్చు చేసి పలు ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో 26 పతకాలు

గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు నిర్వహించిన సీఎం కప్-2024లో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో 26 పతకాలు సాధించారన్నారు. జిల్లాకేంద్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 60మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. జిల్లాలోని 555 చెరువుల్లో దాదాపు 2.09 కోట్ల చేప పిల్లలను వంద శాతం సబ్సిడీపై అందించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద 2024-2025 సంవత్సరంలో మరణించిన 12మంది మత్స్యకారులకు రూ.60లక్షలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకంలో భాగంగా 2,685 మంది లబ్ధిదారులకు 26.88 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మాతృ మరణాలను తగ్గించడానికి జిల్లా యంత్రాంగం అమ్మ రక్షిత కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. నిర్మల్ పట్టణ ఔన్నత్యాన్ని, చరిత్రను ప్రతిబింబించేలా ఇటీవలే జనవరి 5నుంచి నాలుగు రోజుల పాటు నిర్మల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని కవులు, కళాకారులు పాల్గొన్ని జిల్లా గొప్పతనాన్ని చక్కగా వివరించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ప్రజలందరి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తున్న పోలీస్ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తున్న మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకీ షర్మిల, అడిషనల్ కలెక్టర్‌లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్‌తో పాటు ఆర్డీఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో, గాంధీ పార్కులో చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పతాకావిష్కరణ చేశారు.

అలరించిన ప్రభుత్వ శకటాలు

76వ గణతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు వారు సాధించిన అభివృద్ధి, ప్రగతి పనులను తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పోలీసు, వ్యవసాయ, వైద్యారోగ్య శాఖ, గృహ నిర్మాణ, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, మున్సిపల్, నీటి పారుదల శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖతో పాటు మహిళ శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

76వ గణతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. దేశభక్తిని ప్రబోధిస్తూ పలువురు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లను కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ఇతర శాఖల అధికారులు, తదితరులు వాటిని తిలకించి ప్రశంసించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు

జిల్లాకేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతం త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. అలాగే పలు ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి కార్యాలయాల్లో జెండా వందనం చేసి ఈ వేడుకలకు హాజరయ్యారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



జెండాకు వందనం చేస్తున్న విద్యార్థులు, అధికారులు



ప్రశంసపత్రం అందుకుంటున్న డీఎంహెచ్‌వో

మున్సిపాల్టీల ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్

భైంసా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లలో మున్సిపాలిటీలున్నాయి. ఈ మూడు మున్సిపాలిటీలకు జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానికసంస్థలు) ఫైజన్ అహ్మద్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువరించింది. సోమవారం నుంచి మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలు కానుంది.

అవయవదానంపై అవగాహన సదస్సు

నిర్మల్‌రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కావేరి బ్లడ్ బ్యాంక్‌లో చిన్న పిల్ల వైద్య నిపుణుల సంఘం (ఐఏపీ) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వ హించినట్లు జిల్లా అధ్యక్షులు డాక్టర్ చక్రధారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గడపాలే రమేష్ తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అన్ని దానాల కన్నా రక్తదానం, అవయవ దానం గొప్పదని, ఇంకో మనిషికి ప్రాణదాతగా నిలవడం కన్నా విలు వైనదేమీ లేదని, మన దేశంలో సంవత్సరానికి 10 లక్షల అవయవాలు అవసరమైతే కేవలం 3500ల అవయవ మార్పిడి ఆపరేషన్లు అవుతున్నాయని, రోజు కు 15 మంది అవయవాలు దొరకక చనిపోతున్నారని, ప్రతి పది నిమిషాలకు ఒకరు వెయిటింగ్ లిస్టులో నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమం లో డాక్టర్ చైతన్య, డాక్టర్ దేవేందర్ రెడ్డి, డాక్టర్ సంతోష్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో భక్తుల పూజలు

కుంటాల, జనవరి, 26 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తజనం పోటెత్తింది. పలు గ్రామాల నుండి భక్తుల అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అంబులెన్స్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే

కుంటాల, జనవరి, 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మానవుడు తాను జీవిస్తున్న గడ్డతో పాటు జన్మనిచ్చిన గ్రామాన్ని మరవకుండా సేవలందించడం అభినందనీయమని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. ఆదివారం కుంటాల మండల కేంద్రంలో స్థానిక గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో స్వప్న మల్టిస్పెషాలిటీ ఆధ్వర్యంలో కుంటాల మండలం ఓలా గ్రామానికి చెందిన నాలం స్వప్న శశికాంత్ రూ.14 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు అంబులెన్స్‌లను ఆయన ప్రారం భించా రు. మానవసేవే మాధవ సేవ అని స్వప్న శశికాం త్‌లు పేద ప్రజలకు అత్యవసర సమయంలో ఉప యోగపడేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని మండలవాసులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. రెండు అంబులెన్స్‌లు కుంటాల, నర్సాపూర్ (జీ) మండలాల ప్రజలకు సేవలందిం చేందుకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటాయని వైద్యులు నాలంస్వప్న శశికాంత్‌లు తదితరులు పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేసేలా కృషి

భైంసా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింప చేసేందుకు పార్టీ బాధ్యులు కృషి చేయాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం భైంసా మండలం దేగాం గ్రామంలోని తన నివాస గృహంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికల్లో అర్హులకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను , అవసరమైన అభివృద్ధి పనులను సూచిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతతో కృషి చేస్తానని వెల్లడించారు.

ముథోల్ : గణతంత్ర దినోత్సవం వేళ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభోత్సవం చేశారు. గ్రామ పంచాయతీలో గ్రామసభను ఏర్పాటు చేసి మొదట ముఖ్యమంత్రి ప్రసంగాన్ని టీవీ ద్వారా వినిపించారు. అనంతరం గ్రామంలోని అర్హులైన జాబితా ప్రకారం మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో శివకుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీ ప్రత్యేక అధికారి రవీందర్, అగ్రికల్చర్ వ్యవసాయ శాఖ అధికారి రచన, ఏఈవో రాణి, ఆర్ఐ నారాయణ పటేల్, పంచాయతీ కార్యదర్శి రమ్య, ఏపీవో శిరీష రెడ్డి, ఏపీఎం గురుచరణ్, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

సారంగాపూర్ : మండలంలో గల పెండల్‌ధారిలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రజాపాలన గ్రామసభను తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతరావులు నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులందరికీ మంజూరైన రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాల పత్రాలను అందజేశారు. అలాగే అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రజా పాలన గ్రామసభలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, సొసైటీ చైర్మన్లు నారాయణ్ రెడ్డి, మాణిక్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, నాయకులు బి. నర్సయ్య, నారాయణ రెడ్డిలతో పాటు నాయకులు, అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

సోన్ : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. సోన్ మండలంలోని సంగంపేట్ గ్రామంలో ఆదివారం సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, ఎంపీవో కలీం, ఏవో వినోద్, మాజీ సర్పంచ్ విలాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భైంసా రూరల్ : మండలంలోని ఖద్గాం గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగుపథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాకు అర్హులైన లబ్ధిదా రులకు ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోజాం హస్సేన్, ఏపీవో శివలింగయ్య పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాలేవని ఆందోళన చెందవద్దని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి అన్నారు. ఆదివారం సాంగ్వీలో ప్రజా పాలన సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణ రెడ్డి, మాజీ ఎంపీపీ ఫణీందర్ రావు, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు డా. సుభాష్ రావు, నిర్మల్ మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్, మాజీసర్పంచ్‌లు మనోహర్ రావు, అచ్యుత్‌రావు, వినోద్, ప్రత్యేక అధికారి పరుశురాం, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, ఏపీవో దివ్య రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని తాంసి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను అందజేసినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ఈ గ్రామ సభల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డులు) లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, మండల వ్యవసాయ అధికారి వసంత్, ఎంఆర్ఐ మోహన్, ఎంపీవో విజయ్ పాల్గొన్నారు.

మామడ : ఆరు గ్యారంటీలను అమలు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. ఆదివారం మామడ మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ చరిత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల లో చిరునవ్వు చూడడానికి రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు తదితర పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భజంగ శ్రీనివాస్ రెడ్డి, పడాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సోనియా సంతోష్ రాథోడ్, బాపయ్య, రఫీ, గంగారెడ్డి, గంగారాం పటేల్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

● ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

కుంటాల, జనవరి, 26 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడిచినా హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హమీలన్నింటినీ అమలు చేసే వరకు ప్రజల తరఫున కొట్లాడతానని ఆయన అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభ నాలుగు పథకాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని విట్టాపూర్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం, అధికారులు అర్హులుగా గుర్తించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున పోరాడుతానన్నారు. ఈ సందర్భంగా విట్టాపూర్ గ్రామానికి ఇంటి స్థలాలు కలిగిన 55 మందికి ఇండ్లు మం జూరయ్యాయి వారందరికీ ఇండ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. గ్రామంలో 314 మందికి 862 ఎకరాలకు రైతు భరోసా నిధులు మంజూరయ్యాయని, 20 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరవగా మరో 29 మంది ఇటీవల గ్రామసభలో దరఖాస్తు చేసుకోగా లబ్దిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో క్రోడీకరించడం జరుగుతుందని త్వరలోనే వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. 60 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు మంజూరయ్యాయని త్వరలోనే వారి అకౌంట్‌లలో డబ్బులు జమచేయడం జరుగుతుందని ఏపీవో నవీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు మంజూరైన పత్రాలను ఎమ్మెల్యే రామరావు పటేల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీవో రహీం, వ్యవసాయాధికారి విక్రమ్, ఏపీవో నవీన్, పలు శాఖల అధికారులు, గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు,గ్రామస్తులు ఉన్నారు.

భైంసా లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

భైంసా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని కైలాస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ పరిధిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయ ద్వారానికి వేసిన తాళం పగులగొట్టిలోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో అమ్మవారి కిరీటంతో పాటు శఠగోపాన్ని దొంగలు అపహరించుకపోయారు. ఆదివారం ఉదయం పూజారి తాళం పగిలి ఉండటాన్ని గుర్తించడంతో చోరీ ఘటన వెలుగు చూసింది. అనంతరం కమిటీసభ్యులు ఆలయంలో చోటు చేసుకున్న చోరీ ఘటన గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్‌లు ఆలయానికి చేరుకొని పరిశీలించారు. పోలీసుక్లూస్ టీం ఆలయంలో ఆధారాలను సేకరించగా జాగిలం ద్వారా పరిశీలిం చారు. చోరీ ఘటనకు సంబంధించిన ఆధారాలు సేకరించే ప్రక్రియలో పోలీసుఅధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల వీడియో పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టినట్లుగా తెలిసింది. ఆలయ కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత చోరీ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసుఅధికారులు దొంగలను గుర్తించి పట్టుకునే చర్యలను వేగవంతం చేశారు. పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం రాత్రి ముగ్గురు సభ్యులున్న దొంగల ముఠా సంచరించింది. అర్ధరాత్రి 1.30 గంటల నుంచి 3.40 ప్రాంతం వరకు దొంగల ముఠా చోరీకి పాల్పడేందుకు గాను విఫలయత్నం చేసింది. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లపై దొంగల ముఠా తిరిగిందితాళం వేసి ఉన్న ఇళ్లతోపాటు బయట పార్కింగ్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీకి యత్నించింది. చివరగా రెండు ద్విచక్రవాహనాలు అపహరించుకొని పోతుండగా పట్టణ సరిహద్దులో ఒక బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో అక్కడే వదిలి వేసి వెళ్లిపోయినట్లుగా తెలిసింది. అయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో చోరీముఠా సంచరించిన, ద్విచక్ర వాహనాలు అపహరించుకొని వెళ్లిపోయే వీడియోలు రికార్డు అవగా గురువారం అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



సీసీ కెమెరాల్లోని పుటేజీని పరిశీలిస్తున్న టౌన్ సీఐ

తల్లిని హత్యచేసిన తనయుడు



హత్యకు గురైన హిరాబాయి

ముథోల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం నకు డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లిని హత్యచేశాడో ప్రబుద్ధుడు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ముథోల్ ఎస్సై సంజీవ్ కథనం ప్రకారం... నిమ్మ చిన్న గజ్జన్న అనే వ్యక్తి తాగుడికి బానిసై శనివారం రాత్రి అతని తల్లి నిమ్మ హిరాబాయి (70)కి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. తల్లి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో కొడుకు గజ్జన్న కన్నతల్లిని కర్రతో బాది కొడవలితో దాడిచేశాడు. హిరాబాయి అక్కడిక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి పెద్దకు మారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి భార్య గతం లో చనిపోయింది. నింది తుడు జైలుకుపోవడంతో అతని తొమ్మిది సంవ త్సరాల కూతురు, 14 సం వత్సరాల కొడుకులు అనాథలుగా మారారు. మృతురాలిది పేదకుటుంబం కావడంతో గ్రామస్తులు అంత్య క్రియ లకు తోచిన సహాయం అందజేశారు.

గొప్ప రాజ్యాంగం మనది : ఎంపీ గోడం నగేష్



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీ , ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మనది గొప్ప రాజ్యాంగం అని ఎంపీ గోడంనగేష్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు, జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయగీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఏ దేశంలో కూడా ఇంత గొప్ప రాజ్యాంగం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ప్రపంచలో ఎక్కడ లేని విధంగా అతి పెద్ద రాజ్యాంగం భారతదేశంలో అమలవుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన వారి మేధా శక్తికి నిలువెత్తు నిదర్శనం ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. తరతరాల బానిసత్వానికి శాశ్వత విముక్తి కలిగి భారతావని గణతంత్రంగా అవతరించిందని, నాటి త్యాగధనుల సేవలను స్మరించుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది్రశీ నివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సాజిద్‌ఖాన్, గంద్రత్‌సుజాతలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇందులో అంబకంటి అశోక్, సంజీవ్‌రెడ్డి తదితరులున్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్‌చౌరస్తాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాయకులు అల్లూరి రాజారెడ్డి పాల్గొన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌పీ కాజల్‌సింగ్,జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాంప్రసాద్, సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ మల్లయ్య, గ్రామ పంచాయతీ కార్యలయంలో ప్రత్యేక అధికారి ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షులు మొహమ్మద్ షరీఫ్, మండల విద్యావనరుల కేంద్రం లో ఎంఈఓ ఆశన్న,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం రమేష్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

జైనథ్ : జైనథ్ రెవెన్యూ కార్యాలయంలో మండల తహసీల్దార్ శ్యాంసుందర్, మండల పరిషత్ కార్యాలయంలో జైనథ్ ఎంపీడీవో రవీంద్రనాథ్, జైనథ్‌రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో సీఐ సాయినాథ్, పోలీసు స్టేషన్‌లో ఎస్సై వి.పురుషోత్తం, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ పూజ, సహకార సంఘంలో సీఈఓ గంగన్న, మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.లస్మన్న, మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపల్ ఎల్.రాము, కేజీబీవీలో ప్రత్యేక అధికారి వీణాకుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నైనత, వెటర్నరీలో డాక్టర్ వినోద్‌దేశ్ పాండే, జైనథ్ జీపీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి ముజీబ్, మాల సంక్షేమ సంఘంలో అధ్యక్షులు సంజీవ్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ నారాయణ, బీసీ హాస్టల్‌లో వార్డెన్ చిన్న జాతీయ జెండాలను ఎగురవేశారు.

సిరికొండ : తహసీల్దార్ తుకారం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శివరాం, సిరికొండ రైతు వేదికలో ఏవో శ్రద్దారాణి, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో సునీల్ కుమార్, గాంధీ చౌక్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న, పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.

నేరడిగొండ : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖలీం, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజాజ్‌వీర్, ఎంఈవో కార్యాలయంలో భూమారెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి కృష్ణవేణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సద్దాం, పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్, మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ఉత్తంసింగ్, నేరడిగొండ, కుమారి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన సాబ్లే కిషోర్‌సింగ్, మందుల రమేష్ జూనియర్ కళాశాలలో సబానా తరన్నుమ్, భాజాపా కార్యాలయంలో సంతోష్ సింగ్, బాలికల ఆశ్రమ పాఠశాల కుంటాలలో ప్రధానోపాధ్యాయుడు అంబారావు, కేజీబీవీలో ఎస్‌వో రజితా, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణవేణి, అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్‌ఆర్‌వో గణేష్, జాతీయ జెండాను ఎగురవేశారు.

తలమడుగు: తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, పాఠశాల హైస్కూల్‌లో ఎంఈవో వెంకట్‌రావు, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం చంద్రశేఖర్, సహకార సంఘం కార్యాలయంలో చైర్మన దామోదర్‌రెడ్డి, పశు వైద్య కార్యాలయంలో డాక్టర్ లావణ్య, ఎస్సై అంజమ్మ వ్యవసాయ కార్యాలయంలో ఏవో ప్రమోదరెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దేవన్న కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు.

గుడిహత్నూర్: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితా రెడ్డి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హై, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేందర్, పశువైద్యశాలలో డా శ్రీకాంత్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ రమేష్, మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్,సీతాగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాథోడ్ ఉదయ్ రావ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దేవిదాస్, జవహర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చరణ్ దాస్, ఎంజిఎం, జిఎంఎస్ ప్రైవేట్ పాఠశాలో ప్రిన్సిపాల్‌లు జనార్దన్, శేషారావ్‌లు జాతీయ జెండా ఎగురవేశారు జెండాకు వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు అనంతరం పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంద్రవెల్లి: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాస్కర్, మార్కెట్ యార్డు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై దుబ్బాక సునీల్, మేజర్ జీపీలో ఈవో సంజీవరావు, సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్‌ఆర్వో సంతోష్ కుమార్, ఐకేపీలో ఏపీఎం రాథోడ్ రామారావులు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మణ్, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈవో సూర్యప్రకాష్‌లు జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించి నినాదాలు చేశారు.

బోథ్ : మండలంలోని కౌటా(బీ) గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్‌లో వార్డెన్ ఇన్‌చార్జి ఉండడంతో జాతీయ జెండాను ఆదివారం ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న అటెండర్ సిబ్బంది కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. పాఠశాలలు ప్రారంభమై ఏడు నెలలు పూర్తికావస్తున్న హాస్టల్‌లో వార్డెన్‌లా నియామకం జరగకపోవడంతో హాస్టల్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇంచార్జి వార్డెన్లు చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళిపోతున్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జాతీయ జెండాను ఎగురవేశారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చంద్ర జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్, మార్కెట్ కమిటీలో ప్రత్యేక కార్యదర్శి విఠల్ ఆసుపత్రిలో డాక్టర్ రవీంద్ర ప్రసాద్, గాంధీ చౌక్‌లో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బిజెపి కార్యాలయంలో కన్వీనర్ రవీందర్ బోరే, సిపిఐ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఎన్.నరేష్ జెండాలు రెపరెపలాడాయి.



జాతీయజెండాను ఎగుర వేస్తున్న కంది్రశీనివాస్‌రెడ్డి

నార్నూర్: గాదిగూడ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌లు రాజలింగు, విజయానందం జాతీయ పథకాన్ని ఎగర వేసి పోలీసుల ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సీఐ రహీం పాషా త్రివర్ణ పథకాలను ఎగర వేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాల దగ్గర గణతంత్ర వేడుకల్లో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ పాల్గొని పూలమావేసి నివాళులర్పించారు.

భీంపూర్: మండలం కేంద్రం భీంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నలంద ప్రియ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గోపాల కృష్ణ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మొహమ్మద్ కలీం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నిఖిల్ రాజ్, బీఆర్ఎస్ కార్యాలయంలో మేకల నాగయ్య, బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు అంకం అశోక్ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. అలాగే 26 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జెండాను ఎగరవేశారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ మంత్రి



జాతీయ జెండాను ఎగురవేస్తున్న అటెండర్



జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ ఖలీం

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

(3వ పేజీ తరువాయి...)

ఉచిత విద్యుత్‌ను అందిండం జరుగుతుందని తెలిపారు.

ప్రాజెక్టుల భూసేకరణకు నిధులు

లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు, చనకా- కోర్ట ప్రాజెక్టుల భూ సేకరణకు రూ.134 కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం, రూ.71.96 కోట్ల అనుమతులు మంజూరై.. వచ్చే ఖరీఫ్‌కి 27వేల 800 ఎకరాలకు నీరందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.97.20 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.18.99 కోట్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. అదే విధంగా రోడ్డు వసతి లేని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఆదిలాబాద్‌నియోజక వర్గానికి 10.44కోట్లు, బోథ్ నియోజక వర్గానికి రూ.16.16కోట్లు, ఆసిఫాబాద్ నియోజక వర్గానికి రూ.5.70కోట్లు మంజూరైన టెండర్‌ల దశలో ఉన్నాయని పలు అంశాలపై వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పట్టణంలోని పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు, ఎస్పీ గౌస్‌ఆలం, డీఎఫ్‌వో, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఆయా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దేశ భక్తి గేయాలకు చేసిన నృత్యాలు, విన్యాసాలు ఆహూతులను ఎంతగానో అబ్బురపరిచాయి.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ విద్యా శాఖ, ఆర్టీసీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పోలీసు శాఖ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య, పౌర సరఫరాల శాఖ, తదితర శాఖల శకటాలు గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే విధంగా ప్రభుత్వ శాఖల్లో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వారిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన పలువురు ఉద్యోగులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించారు.

ఇందిరమ్మ పథకాలు వినియోగించుకోవాలి

భీంపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు పథకాలు ప్రారంభించిందని బేలర్సి రాంపూర్ నుంచి ప్రారంభం కావడం సంతోషకరమని మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. ఆదివారం బేలర్సి రాంపూర్‌లో నాలుగు పథకాలు ప్రారంభించి సంబంధిత పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గతంలో కాంగ్రెస్‌లో ఉండగా కాంగ్రెస్ కండువాతో ఉన్న ఫొటోను ఫ్లెక్సీలో పెట్టడంపై బీఆర్ ఎస్ నాయకుడు మాజీ ఎంపీపీ కుద్మెత సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం గ్రహించిన అధికారులు అప్పటికప్పుడు కొత్త ఫ్లెక్సీని తెప్పించారు.

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామంలో పథకాల ప్రారంభోత్సవంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై పథకాలను ఆవిష్కరించారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం కచ్చితంగా పథకాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, పిఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ సర్పంచ్ రాజు యాదవ్, అనిల్ యాదవ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు వనజ, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ప్రజా అభివృద్ధి, సంక్షేమం మాట తప్పని కాంగ్రెస్ ప్రభుత్వమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని గట్టేపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాతో కలిసి ప్రారంభించారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సునీత, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదారావు, అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వో కిరణ్‌కుమార్, బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యాజాన్సన్ నాయక్, ఖానాపూర్‌లోని తన నివాసంలో ఏపీసీఎస్సీ మాజీ సభ్యులు పైడిపల్లి రవీందర్ రావు ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సట్ల శంకర్, లక్ష్మీనారాయణలు ఆయా ప్రభుత్వ శాఖల్లో ఆయా శాఖల అధికారులు, ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో సంఘాల అధ్యక్షులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీకాంతరావుతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే సంఘ భవనాల్లో సంఘాల అధ్యక్షులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేసి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సోన్ : మండలంలోని సిద్దులకుంట గ్రామ ఉన్నత పాఠశాలలో గణతంత్రదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు హరీష్ రెడ్డి పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు తమ నృత్యాలతో అందరినీ అలరించారు. ముఖ్యఅతిథులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రేఖ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడారి దశరథ్, చంద్రశేఖర్ రావు, టి. నరేందర్, బి. నరేందర్, భూమారెడ్డి, ముర్తుజా ఖాన్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మల్లేష్, ఎంపీడీవో కార్యాలయంలో సురేష్, పోలీస్ స్టేషన్‌లో సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి, ఆయా ప్రధాన కూడళ్ల వద్ద ఆయా పార్టీ నాయకులు, అధికారులు మహనీయుల చిత్రపటాల నివాళులర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నిర్మల్ రూరల్ : కొండాపూర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ కన్వీనర్ కే. రామకిషన్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్ నాయకులు నజీరుద్దీన్, అక్రమ్ అలీ, పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు తమ పార్టీ కార్యాలయంలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో జెండా ఎగురవేశారు.

నిర్మల్ అర్బన్ : 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భాగ్యనగర్ కాలనీలో ఆదివారం జాతీయజెండాను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి భీమ్ రెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ నేత ఎంబడి రాజేశ్వర్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, దేవరకోట ఆలయ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మెప్మా జిల్లా అధికారి సుభాష్, తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌక్‌లో మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దినేష్, కార్తీక్, సమత జగదీశ్వర్, విజయ వరమ, మహమ్మద్ షర్ఫుద్దీన్, అగ్రి విజయరాజ్, సతీష్, గౌతమ్, రుద్రాజ్ రానా, తదితరులు పాల్గొన్నారు. పటిష్టమైన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో యువత ముందుకు రావాలని వశిష్ట విద్యాసంస్థల చైర్మన్ వి. సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఏబీవీపీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ... అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 76వ గణ తంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. కార్యక్రమంలో రామాలయం జోనల్ ఇన్‌చార్జి జగదీష్, గణేష్, ఆదిత్య, రిషి, సాత్విక్, ఏబీ వీపీ పూర్వ కార్యకర్తలు, రాంనాథ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి తనయుడు అల్లోల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకుడు నాళం శ్రీనివాస్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాకాల రామచందర్, అప్పా మహేష్, అల్లోల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకర్షించిన చిన్నారుల వేషధారణ

లక్ష్మణచాంద : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, యువజన సంఘాలు, డాక్టర్ బాబాసాహెబ్, గాంధీజీ, సుభాష్ చంద్రబోస్ తదితర విగ్రహాల వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ కార్యాలయంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాథోడ్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుమలత, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం వాణిశ్రీ, కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రిన్సిపాల్ నవిత, ఎస్వీజీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భోజన్నలు, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాలు, అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు మువ్వన్నెల జెండా ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.

దిలావర్‌పూర్ : తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్‌వో స్వాతి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణ రాణి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లోక సందీప్, స్త్రీ శక్తి భవనంలో ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, పీఏసీఎస్ భవనంలో చైర్మన్ పీవీ రమణారెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన ప్రజాస్వామ్య దేశంలో కులాలు, మతాల పేరుతో మనలో మనం కలహించుకోవడం మంచిది కాదన్నారు.

భైంసా : పట్టణ పరిధిలోని ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, మున్సిపల్ కార్యాలయలో వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో, కార్యాలయాల్లో ఆయా కార్యాలయాల, ఆయా సంస్థల ఇంచార్జీలు, బాధ్యులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి వ్యాప్తిని నియంత్రించే విధానాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే చర్యలు చేపట్టడంలో ఉత్తమ పనితీరును కనబరిచిన భైంసాలోని ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కేంద్రానికి టీజీఎస్ ఎయిడ్స్ కంట్రోల్ సోసైటీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డును ప్రధానం చేసింది.

ముథోల్ : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివ కుమార్, మండల విద్యావనరుల కార్యాలయంలో విద్యాధికారి రమణ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్, ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య, ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ వినయ్ బాబు, ఐకేపీ కార్యాలయంలో అధ్యక్షురాలు జయశీల, ముథోల్ గ్రామ పంచాయతీలో ఎంపీడీవో శివ కుమార్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరోజిని, ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సూర్యదాస్ మూడు రంగుల జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డా.అనిల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ వెంకటేష్ గౌడ్, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీలో కార్యదర్శులు త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. రబింద్ర, అక్షర, శ్రీవిద్యా, భాష్యం, ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు చేసి సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తానూర్ : గ్రామపంచాయతీలో కార్యదర్శి జాలం సింగ్, పోలీస్టేషన్‌లో ఏఎస్సై భానుప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నసీరోద్దిన్, పీఏసీఎస్ తానూర్ కార్యాలయంలో నారాయణ్‌పటేల్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఏపీవో గంగాధర్, మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్‌లు, రైతువేధికల్లో ఏఈవోలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.

కుభీర్ : మండల కేంద్రం కుబీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర్య వేడుకలు అంబరాన్నంటాయి. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో విజయ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్, పీఏసీఎస్‌లో చైర్మన్ గంగాచరణ్, ఏంఎసీలో కార్యదర్శి గంగన్న, పోలీస్టేషన్‌లో ఎస్సై రవీందర్, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు, ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు జెండాను ఆవిష్కరించారు. పలు పాఠశాలలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కుంటాల : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ జెండాను ఎగురవేయగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లింబాద్రి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై భాస్కర చారి, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో ముత్యంతో, వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాధికారి విక్రమ్‌తో పాటు ఆయా గ్రామపంచాయతీలలో పంచాయతీ సెక్రటరీ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కుంటాల ఆదర్శ మాడల్ పాఠశాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



పోలీస్ స్టేషన్‌లో మువ్వన్నెల జెండా ఎగురవేస్తున్న ఎస్సై సుమలత

భైంసా రూరల్ : మండలంలోని గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, సీఐ నైలు జాతీయ గీతం ఆలపించారు. అదే విధంగా మండల ప్రజా కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేసి, గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాలిక్, ఎంపీవో మోజాం హుస్సేన్, శివలింగయ్య, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీకాంతరావుతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే సంఘ భవనాల్లో సంఘాల అధ్యక్షులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేసి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జెండాలు ఎగురవేశారు. లోకేశ్వరం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో వెంకట రమేష్ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతిరాం, పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అశోక్, సెకండరీ పాఠశాలలో సుధాకర్ సింగ్, ప్రైవేట్ పాఠశాలలో వారి వారి ప్రిన్సిపాళ్లు జెండాలు ఎగురవేశారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సెండరీ పాఠశాల లోకేశ్వరం, అమెరి కిడ్స్ ఇన్‌స్కాలర్స్, రామకృష్ణ విద్యాశాల, వేదం పాఠశాలలో విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 26ను పురస్కరించుకొని వివిధ పాఠశాలల్లో ఆటలు ఆడించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.



భైంసాలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్



ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



నల్లుర్తి తుర్కం చెరువులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పక్షులు

తుర్కం చెరువు వద్ద పక్షుల సందడి

- నల్లుర్తిలోని తుర్కం చెరువు వద్ద నేచర్ క్యాంప్
- 60 జాతుల పక్షుల్ని గుర్తించిన పర్యాటకులు





చెట్టుపై వివిధ జాతుల పక్షులు

మామడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికులు, పక్షుల అభిమానులకు మామడ మండలంలోని రెండు చెరువులు ఆహ్లాదాన్ని కలిగించాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లుర్తి తుర్కం చెరువు, వెంగన్న చెరువుల వద్ద నేచురల్ క్యాంప్ నిర్వహించడంతో హైదరాబాద్ దక్కన్‌బర్డ్స్ సొసైటీ ఆఫ్ తెలంగాణకు చెందిన సుమారు 15 మంది పర్యాటకులు తుర్కం చెరువు, వెంగన్న చెరువును సందర్శించారు. ఇక్కడ వారు 60 జాతుల పక్షుల్ని గుర్తించారు. శనివారం రాత్రి తుర్కంచెరువు వద్ద నేచర్ క్యాంప్ నిర్వహించి ఆదివారం వెంగన్న చెరువుతో పాటు పలు పట్టణాల నుంచి ప్రకృతి పర్యాటకులు వచ్చారు. రెండు రోజులపాటు బస చేసేందుకు అధికారులు అడవిలో ఏర్పాట్లుచేశారు. ఆదివారం నల్లుర్తి అటవీ ప్రాంతంలో వలస పక్షుల కిలకిల రాగాలను విని పులకించారు. వాటిని కెమెరాల్లో బంధించారు. గతంలోనూ హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వన్యప్రాణుల మనుగడ కోసం తమవంతు ప్రయత్నం చేస్తున్నామని నేచర్ క్యాంప్ నిర్వహించారు. పర్యాటకుల కోసం దిమ్మదుర్తి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌వో అన్నపూర్ణ, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ రాజు, అంజన్న, తదితరులు అన్ని ఏర్పాట్లు చేశారు. వారివెంట ఉండి సఫారీ వాహనంలో పలు ప్రదేశాలను చూపించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎంతో బిజీ లైఫ్‌లో ఒక్కసారైనా ప్రకృతిఒడిలో గడిపితే మనసు ప్రశాంతంగా ఉంటుందని వన్యప్రాణుల పట్ల, అటవీ సంపద పట్ల అవగాహన కలుగుతుందని, నెలలో ఒక్కసారైనా ప్రకృతిలో పర్యటించాలని పేర్కొన్నారు.



పక్షులను కెమెరాల్లో బంధిస్తున్న పక్షుల ప్రేమికులు

‘ఆంధ్రజ్యోతి’లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో గల ‘ఆంధ్రజ్యోతి’ యూనిట్ కార్యాలయంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యూనిట్ బ్రాంచ్ మేనేజర్ నల్ల తిరుపతి రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ వేడుకల్లో ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్ కుమార్, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వర్, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్, సబ్ ఎడిటర్ నర్సింహారావు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రతన్, నిజామాబాద్ ఆర్‌సీ ఇన్‌చార్జి ఆంజనేయులు, హెచ్‌ఆర్ రవి, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.







అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూజలు చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా



జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న జిల్లా కలెక్టర్, పక్కన ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

జిల్లావ్యాప్తంగా గణతంత్ర వేడుకలు

గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాల యాలు, పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, జాతీయ జెండాను ఎగురవేశారు. ఆదిలాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ రాజార్షిషా అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళ్లర్పించి జెండాను ఎగురవేసి ఉత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు. మండల కేంద్రాల్లోనూ ఆయా కార్యాలయాల అధికారులు జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలతోపాటు ఆయా కుల సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్







మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా



లంబాడి పాట మీద నృత్యం చేస్తున్న రిమ్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు



పరేడ్ మైదానంలో పోలీసు శాఖ ద్వారా ఏర్పాటు చేసిన శకటం



విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల శకటం ప్రదర్శన



మహిళ, శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఏర్పాటు చేసిన శకటం

భక్తులతో కిటకిటలాడిన

పూసాయి ఎల్లమ్మ మహాజాతర

- మహారాష్ట్ర నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

జైనథ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసాయి గ్రామంలోని రేణుకా మాతా ఎల్లమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వందలాది మంది మహిళలు భక్తుల హాజరై స్థానిక కోనే స్నానమాచరించారు. ఈ సందర్భంగా వివిధ పిండి వంటలతో కూడిన నైవేద్యాలను వండి ఎల్లమ్మకు సమర్పించారు. ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని కోళ్ల మేకలను బలి ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. జాతరలో ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పూసాయి గ్రామస్థులు భక్తులకు అన్ని సౌకార్యలను కల్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జైనథ్ మండల ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో భారీపోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు, భక్తులు

మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయుల తూమ్ పూజలు



నాగోబా మహాపూజపై చర్చిస్తున్న ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్



వంటలు, నైవేధ్యాలు తయారు చేస్తున్న మెస్రం వంశీయులు, మహిళలు

ఇంద్రవెల్లి, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర ఈనెల 28న పుష్యమాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్రం వంశీయుల మహాపూజలతో జాతర ప్రారంభమవుతుంది. కాగా, ఈ వేడుకకు మెస్రం వంశీయులతోపాటు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి ఎడ్లబండ్లతో పాటు ఇతర వాహనాలతో మెస్రం వంశీయులు తరలివచ్చి మర్రి చెట్టు వద్ద బస చేశారు. శనివారం రాత్రి ఆయా గ్రామాల నుంచి మెస్రం వంశీయులు పటేళ్లకు కాకడ హారతి పట్టి స్వాగతం పలికా రు. ఆదివారం రాత్రి వారి ఆచారం ప్రకారం మెస్రం వంశంలో మృతి చెందిన వారి పేరట తూమ్ పూజలు నిర్వహించారు. ఈ పూజలతో చనిపోయిన వారు నాగోబా సన్నిధికి చేరుతారనేది వారి నమ్మకం. మహాపూజలకు అవసరమగు పవిత్ర గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు మర్రి చెట్టు వద్ద 22కితల వారీగా గుడారాలు ఏర్పాటుచేసి బసచేశారు. కితల వారీగా వంటలు నైవేద్యాలు తయారు చేసి పూజ సామగ్రి వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, మెస్రం చిన్ను పటేల్, కటోడ మెస్రం కోసేరావు, మెస్రం దేవ్‌రావు, ప్రధాన్‌మెస్రం దాదారావు, మెస్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మర్రి చెట్టు వద్ద మెస్రం వంశీయులు




పిప్పర్‌వాడలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్


హస్నాపూర్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తూ..

అర్హులైన ప్రతి ఒక్కరికీ.. సంక్షేమ పథకాలు

- అందరి సహకారంతోనే జిల్లా అభివృద్ధికి కృషి
- 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా
- జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ పతాకావిష్కరణ
- ఆకట్టుకున్న ఆయా శాఖల శకటాలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న జిల్లా కలెక్టర్, పాల్గొన్న ఎస్పీ, ఎంపీ, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో నాలుగు పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసాను ఆదివారం నుంచి అమలుకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీలైన మహాలక్ష్మి, గృహజ్యోతి, యువ వికాసం, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల 21 నుంచి 24 తేదీల్లో 473 గ్రామ పంచాయతీలు, 49 వార్డుల్లో చేపట్టిన గ్రామ, వార్డు సభల్లో 77వేల 442 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అలాగే జిల్లాలోని 18వేల 741 కొత్త రేషన్ కార్డు లబ్ధిదారుల జాబితాను పరిశీలించి గ్రామ, వార్డు సభలలో అర్హులైన వారిని గుర్తించడం జరిగిందన్నారు. అదేవిధంగా మార్పులు, చేర్పులు, జాబితాలో పేరు లేని వారికి కూడా గ్రామ, వార్డు సభలలో దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించి అర్హులైన వారం దరికీ రేషన్ కార్డులను అందజేస్తామన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆహార భద్రత కార్డు గ్యాస్ కనెక్షన్ ఉండి ప్రజాపాలన కార్యక్రమంలో రూ.500 గ్యాస్ సబ్సిడీ కింద 98వేల 660 మంది లబ్ధిదారులు అర్హులుగా గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 3లక్షల 27వేల 600 ఎల్‌పీజీ సిలిండర్‌లు సరఫరా చేయడం జరిగిందని ఇందుకు రూ.9.24 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.

రూ.12వేల పెట్టుబడి సహాయం

రైతు భోరోసా పథకం కింద జిల్లాలో సాగుకు యోగ్యమైన భూములకు ఎకరానికి రూ.12 వేలపంట పెట్టుబడి సహాయంగా అందించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నాలుగు విడతలలో ఇప్పటి వరకు 62వేల 16 మంది రూ.2 లక్షల వరకు రుణం కలిగిన రైతులకు రూ.685.42 కోట్ల రూపాయలు జమ చేశామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఉత్తుర్వుల మేరకు ఒక్కో నియో జకవర్గానికి 3వేల 500 ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ ద్వారా లక్షా 6వేల 690 దరఖాస్తులను సర్వే చేయడం జరిగిందని, మండలానికి ఒకటి చొప్పున 17 మోడల్ ఇందిరమ్మ ఇళ్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కాగా, గ్రామ, వార్డ్ సభల్లో 22వేల 309 దరఖాస్తులు సేకరించామని, అర్హులైన లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కాగా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం డిసెంబర్ 9, 2023న ప్రారంభించి ఇప్పటి వరకు ఒక కోటి 38 లక్షల 77 వేల 186 మంది మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణించారన్నారు. అలాగే గృహ జ్యోతి పథకం ద్వారా అర్హులైన వినియోగదారులందరికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ పథకం క్రింద ఇప్పటివరకు అర్హులైన 98,489 మంది వినియోగదారులకు

(తరువాయి 4వ పేజీలో...)

లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత

జైనథ్: జిల్లాలోని ఆయా గ్రామాలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన గ్రామసభలో భాగంగా ఆది వారం మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో మొదటి విడతగా ఆయా మండలాల్లోని 17 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగు తుందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు 248, రేషన్‌కార్డులు 23 మందికి ఆత్మీయ భరోసా 66, రైతు భరోసా ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. ఇందులో మండల ప్రత్యేక అధికారి జె.భాస్కర్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, డీటీ రాజేశ్వర్, మార్కెట్ చైర్మన్ ఎ.అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎ.రుకేష్‌రెడ్డి, ఎంపీవో వెంకట్‌రాజ్, ఏపీఎం భగవాండ్లు, మాజీ సర్పంచ్ సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

● ప్రభుత్వ పథకాలలో భాగస్వాములు కావాలి

తాంసి: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై అభివృద్ధి చెందాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. 310 మంది రైతులకు రైతు భరోసాను మంజూరు చేశారు.


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా


విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల శకటం ప్రదర్శన


పరేడ్ మైదానంలో వేడుకలకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు


సరస్వతీనగర్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థులు


కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్, సిబ్బంది

అంబేద్కర్ కృషితో రూపుదిద్దుకున్న రాజ్యాంగం : న్యాయాధికారి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కృషితో రూపుదిద్దుకున్న రాజ్యాంగం ద్వారానే నేడు ప్రజలంతా స్వాతంత్ర ఫలాలను అనుభవించ గలుగుతున్నారని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. అంతకుముందు న్యాయయాధికారి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఇందులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయాధికారులు శివరాంప్రసాద్, దుర్గారాణి, ప్రమీల జైన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, బార్ సభ్యులు, తదితరులున్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బంది సమక్షంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం అమలు సందర్భంగా నిర్వహించుకునే ఈ గణతంత్ర దినోత్సవాన్ని ప్రతీ ఒక్కరు సంతోష వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలపారు. 76వ ఏట అడుగుపెట్టిన వేళ దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఇందులో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, పట్టణ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, టి.మురళి, బి.శ్రీపాల్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్‌ఉల్‌హక్, సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్, పాస్ట్‌పోర్టు, తదితరులున్నారు.

మారుమూల గ్రామాలకు సోలార్ వెలుగులు

● ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి ● 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా


మహాత్ముల చిత్రపటాలకు పూలమాలలు వేసి నమస్కరిస్తున్న పీవో


ఉట్నూర్ ఐటీడీఏలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తూ..

ఉట్నూర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌకర్యం లేని ఆదిమ గిరిజన గ్రామాల ప్రజలకు సోలార్ వెలుగులు కల్పించడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రధానకార్యాలయం ఆవరణలో జాతీయ నాయకులకు పూలమాలలు వేసిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం పీవో ఖుష్బుగుప్తా స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. 2022-23లో 437 పీవీటీజీ గిరిజన గ్రామాలలో సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించామని, 2023-24 సంవత్సరంలో సోలార్ సిస్టం ద్వారా 90 మంది లబ్ధిదారులకు సోలార్ సిస్టం విద్యుదీకరణ అమర్చడం జరిగిందన్నారు. ఇంకా విద్యుత్ లేని గ్రామాలను గుర్తించి సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆర్థిక సహాయ పథకం ద్వారా 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గాను రూ.44.67 కోట్ల సబ్సిడీతో 4383 మంది గిరిజనులను ఎంపిక చేశామన్నారు. ఇందులో 2160 మంది లబ్దిదారులకు రూ.20.25కోట్ల సబ్సిడీ విడదలైంది అన్నారు. రూ.4కోట్లతో రెండు గిరిజన భవన్‌లను నిర్మించామని, రూ.52,450 లక్షలతో 424 రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, 40 పరులు పూర్తిగాక 384 పనులు నడుస్తున్నాయన్నారు. రూ.4580 లక్షలలో 20029 గ్రామ పంచాయతీ భవనాల పనులు మంజూరు కాగా 205 పనులు పూర్తి అయ్యాయని, రూ.782 లక్షలతో 155 అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా 136 పూర్తి అయ్యాయని ఐటీడీఏ పీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. రూ.487 లక్షలతో ఆశ్రమ పాఠశాలలలో అదనపు తరగతి గదులు తదితర పనులకు 131 పనులు మంజూరు కాగా 122 పనులు పూర్తి అయ్యాయన్నారు. విద్య వైద్య రంగాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆశ్రమ పాఠశాలలోని బాలికల్లో రక్తలేమిని గుర్తించి ఆరోగ్య పోషణ మిత్ర కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన 849 మంది గర్భిణులకు, 983 మంది బాలింతలకు ఒకపూట సంపూర్ణ భోజనం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా హాజరైన ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు మాట్లాడుతూ గణతంత్ర వేడుకలను ఆధ్వర్యంలో ప్రతియేటా కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థులు ప్రతీఒక్కరు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు, అధికారులకు, వైద్యులకు, సిబ్బందికి గురుకులాల సిబ్బందికి, గిరజన సహాకార సిబ్బందికి ఉత్తమ ఉద్యోగుల అవార్డులను అందించారు. జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, పరిపాలన అధికారి దామోదర స్వామి, పీహెచ్‌వో సందీప్‌కుమార్, వైటీసీ నాగభూషణం, ప్రవీణ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏసీఎంవో జగన్, కొమ్రం ఈశ్వరీబాయి, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న పీవో, ఎమ్మెల్యే బొజ్జు పటేల్


సుద్దగూడలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, పీవో

ప్రజాపాలనలో సమస్యల పరిష్కారం

● సుద్దగూడలో పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజాపాలన ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుద్దగూడ గ్రామంలో ప్రజాపాలనలో మరో ముందడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి నాలుగు పథకాలను ప్రజలకు అందుబాటులోకి చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మత్తనుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో 319 ఇందిరమ్మ ఇళ్లు, 49 మందికి ఆత్మీయ భరోసా, 311 మందికి రైతు భరోసా, 60 మందికి కొత్త రేషన్‌కార్డులు అందించడంతో పాటు 17 మందికి సవరణలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు అన్ని గ్రామాలలో గుడిసె రహిత రాష్ట్రంగా మార్చాలని చూస్తున్నారన్నారు. ఇవి నిరంతరం కొనసాగే ప్రక్రియలని ఇతరులకు వచ్చింది తమకు రాదని ఎవరు భ్రమ పడవద్దని ప్రతీఒక్కరికి అర్హులైన వారికి పథకాలు అందుబాటులోకి వస్తాయతికి ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులకు మోక్షం లభించింది అన్నారు. భూమిలేని నిరుపేద మహిళలకు ఆత్మీయ భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తేవడం హర్షించదగ్గది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.సుధాకర్, ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీన్‌కుమార్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రజినికాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ జైవంత్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ రాధాబాయి, ఆత్రం తిరుపతి, మోతిరామ్, కొద్దుపటేల్, లింగంపల్లి చంద్రయ్య, మొహమ్మద్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

వైజాపూర్‌లో సంక్షేమ పథకాలను ప్రారంభించిన అధికారులు

గుడిహత్నూర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం మండలంలోని వైజాపూర్‌లో జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అడిషనల్ కలెక్టర్ అబిజ్ఞాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఆయా పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ఈ నాలుగు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం ప్రతీఒక్కరు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్ఐ అరుణ్ కుమార్, ఏవో రమేష్, తదితరులు పాల్గొన్నారు.


వైజాపూర్‌లో మంజూరు పత్రాన్ని అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


నవేగాంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎంపీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, జనవరి 26,(ఆంధ్రజ్యోతి): నూతన నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో భాగంగా మండలంలోని నవేగాం గ్రామంలో నిర్వహించిన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉట్నూర్ సబ్ డివిజన్ కలెక్టర్ హాజరై లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీఒక్కరికి పథకాలు అందేలా చూడాలని, పథకాల అమలులో పేర్లు రాని వారు నిరాశ పడకుండా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. నవేగాం గ్రామంలోని 115 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, 82 మందికి రేషన్‌కార్డులు, 33 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అందజేయడం జరిగింది. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికల్లో అర్హులకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్దిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సబ్‌డివిజన్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞ మాలవీయ, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, ఏఓ కైలాష్, తదితరులు పాల్గొన్నారు.